డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR



విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069



| పెద్దపల్లి Peddapalli | మంగళవారం Tuesday | 03 - 03 -2026 03 - 03-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక: 44 Issue: 44 | పేజీలు: 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|


## తెలంగాణ పౌరులకు అండగా ప్రభుత్వం

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.



**జనం వాయిస్, న్యూఢిల్లీ, మార్చి 2:**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ పౌరుల భద్రత కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు - మిగతా 2 లో...



## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

### వికారాబాద్ వేదికగా సీఎం రేవంత్ పిలుపు

**ప్రజా జీవితంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నానని వ్యాఖ్య.**
**దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ బలపడాలన్న సందేశం.**

**జనం వాయిస్, వికారాబాద్, మార్చి 02:**

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీను దేశ ప్రధాని పీఠంపై చూడడమే తమ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వికారాబాద్‌లో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిని సమర్థంగా ఎదుర్కొనే నాయకత్వం అవసరమని రేవంత్ - మిగతా 2 లో...

## దుబాయ్‌లో చిక్కుకున్న తుమ్మల

యుద్ధ వాతావరణంతో విమానాశ్రయం మూసివేత.
కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లి అక్కడే నిలిచిపోయిన మంత్రి.
సురక్షితంగానే ఉన్నానని తుమ్మల స్పందన.


2

## హైడ్రా చర్యలపై బండి సంజయ్ ఆగ్రహం


2

## భారత్-కెనడా సంబంధాలకు కొత్త ఊపు


3

## అహంకారం విడిచిపెట్టి పార్టీ కోసం పనిచేయాలి.

- మార్షల్ ఆర్ట్స్‌తో రాజకీయ సందేశం.
- డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో రాహుల్ ప్రత్యేక క్లాస్.
- దేశ, అంతర్జాతీయ రాజకీయాలపై ఘాటైన వ్యాఖ్యలు.
- అహంకారం విడిచిపెట్టి పార్టీ కోసం పనిచేయాలి.

**జనం వాయిస్, వికారాబాద్, మార్చి 02:**



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం వికారాబాద్ అనంతగిరి హరితా రిసార్ట్స్‌లో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సాధారణ రాజకీయ ప్రసంగంతో కాకుండా మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జియు జిట్సు మార్షల్ ఆర్ట్‌లోని క్రమశిక్షణ, ధైర్యం, సమతుల్యత వంటి అంశాలను - మిగతా 2 లో...

## "మాకు ఉండడానికి చోటే లేదు"

ఇండ్ల కూల్చివేతలపై బాధితుల ఆవేదన.
కలెక్టరేట్ పరిధిలో వెలుగుమట్ల ఘటన.
ప్రభుత్వ స్పందన కోరుతున్న బాధితులు.

2 లో





## బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం ఫెయిల్

ఎంపీ ఈటల రాజేందర్.
పీఆర్సీ, డీఏ, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ తక్షణ చెల్లింపు డిమాండ్.
రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు.

2

## మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి

**బాచుపల్లిలో విద్యార్థినిపై దారుణం.**
**డార్క్ వెబ్ ద్వారా చాక్లెట్లు, మాత్రలు పంపినట్లు ఫిర్యాదు.**
**ఆత్మహత్యాయత్నంతో వెలుగులోకి ఘటన.**


**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 02:**

హైదరాబాద్ నగరంలోని బాచుపల్లిలో ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఆశిష్ అనే విద్యార్థి మత్తుమందు కలిపిన చాక్లెట్లు, మాత్రలు ఇచ్చి కాలేజీ మరియు హోటళ్లలో దాడులకు పాల్పడినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు - మిగతా 2 లో...


2

## "ఏఐసీసీ కి ఏటీఎం తెలంగాణ"

రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యంగ్య పోస్టు.
వెయ్యి కోట్ల వ్యాఖ్యలపై రాజకీయ దుమారం.
ఆరు హామీల అమలుపై సమీక్ష కోరిన కేటీఆర్.


2

## "తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది"



ఖమ్మం కూల్చివేతలపై పినరయి విజయన్ విమర్శలు.
700 ఇళ్ల కూల్చివేత, 3 వేల మంది నిరాశ్రయులయ్యారని ఆరోపణ.
అణగారిన వర్గాలపై దాడులకు సమాధానం చెప్పాలన్న డిమాండ్.

# తెలంగాణ పౌరులకు అండగా ప్రభుత్వం

- మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ పౌరులు, అలాగే వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తూ అవసరమైన సహాయ చర్యలకు సమన్వయం చేస్తున్నారు. ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదుర్కొన్నా న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న నియంత్రణ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. ఈ కేంద్రం ద్వారా అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందించబడతాయని పేర్కొన్నారు. నియంత్రణ కేంద్రానికి సంప్రదించాల్సిన ఫోన్ సంఖ్యలు ఇలా ఉన్నాయి: శ్రీమతి వందన బరువా 9871999044, శ్రీ సీహెచ్ చక్రవర్తి 9958322143, శ్రీ జావేద్ హుస్సేన్ 9910014749, శ్రీ రక్షిత్ నాయక్ 9643723157. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

# హైడ్రా చర్యలపై బండి సంజయ్ ఆగ్రహం

**పేదల ఇళ్లు కూల్చివేతలపై విమర్శలు.**
**బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ఇళ్ల లెక్కలు చెప్పాలని సవాల్.**
**దేవాలయాలపై దాడుల అంశంపై స్పందన.**

**జనం వాయిస్, కామారెడ్డి, మార్చి 02:**

హైదరాబాద్ నగరంలో హైడ్రా పేదల ఇళ్లను కూల్చుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద కోట్లాది ఇళ్లు నిర్మిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేత ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. హైడ్రాకు పెద్దవారి ఇళ్లు కనిపించడం లేదని, కేవలం పేదల ఇళ్లు మాత్రమే లక్ష్యంగా మారుతున్నాయని ఆరోపించారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఎన్ని ఇళ్లను కూల్చివేశారో లెక్కలు తీయడానికి ప్రభుత్వం సిద్ధమా అని సవాల్ చేశారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలో భూదాన్ పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజం జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పేర్కొన్నారు. దేవాలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ సామాన్యులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్యాలమ్మ గుడి, చాంద్రాయణగుట్టలోని హనుమాన్ దేవాలయ ఘటనలను ప్రస్తావిస్తూ, ఇలాంటి సంఘటనలపై సమాజం స్పందించాలని పిలుపునిచ్చారు. తమ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ప్రశ్నించడం హక్కు అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని హిందూ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ధార్మిక స్థలాల పరిరక్షణ కోసం అన్ని వర్గాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, చట్టపరమైన విధానాల్లోనే సమస్యలకు పరిష్కారం కనుగొనాలని సూచించారు.

# దుబాయ్‌లో చిక్కుకున్న తుమ్మల నాగేశ్వరరావు

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 02:**

పశ్చిమాసియాలో అనూహ్యంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరు అనారోగ్యానికి గురి కావడంతో వారిని పరామర్శించేందుకు ఐదు రోజుల క్రితమే దుబాయ్ వెళ్లిన ఆయన, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా స్వదేశానికి తిరిగి రావలేకపోతున్నారు. ఇరాన్ క్షిపణి దాడుల లక్ష్యాన్ని యూఏఈ, కువైట్, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాల వైపు మళ్లించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు సమాచారం. అన్ని విమాన సర్వీసులను రద్దు చేయడంతో అక్కడి జనజీవనం తీవ్ర ప్రభావానికి లోనైంది. విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన సురక్షితంగానే ఉన్నప్పటికీ, విమానాశ్రయ అధికారులు అనుమతి ఇచ్చే వరకు భారత్‌కు తిరిగి రావడం సాధ్యం కాదని తెలుస్తోంది. విమాన సర్వీసులు పునఃప్రారంభమైన వెంటనే హైదరాబాద్‌కు బయల్దేరుతానని ఆయన తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం



- మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. ఆ బాధ్యతను నిర్వర్తించగల సామర్థ్యం రాహుల్ గాంధీకి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ బలపడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ప్రజల సమస్యలను ఎత్తిచూపాలని సూచించారు. ప్రజా జీవితంలో తాను ఎప్పుడూ పైరవీలు చేయలేదని రేవంత్ స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై గళం విప్పినందుకు తనపై అనేక కేసులు నమోదయ్యాయని గుర్తుచేసుకున్నారు. ఆదివారం కూడా కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. గత 19 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. పార్టీ పదవులు నిర్వహిస్తూ, ఎమ్మెల్యేగా అనుభవం సంతరించుకున్నానని వివరించారు. తనపై పరువు నష్టం దావాలు, కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదని రేవంత్ అన్నారు. దేశ సమస్యలపై రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఐదేళ్ల కృషి ఫలితంగానే రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచారని చెప్పారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

# అహంకారం విడిచిపెట్టి పార్టీ కోసం పనిచేయాలి.

- మొదటిపేజీ తరువాయి...

వివరించిన రాహుల్ గాంధీ, నాయకత్వానికి శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా మానసిక స్థైర్యం కూడా అవసరమని చెప్పారు. మార్షల్ ఆర్ట్స్‌లోని నియమాలను వ్యక్తిగత జీవితం, రాజకీయ జీవనంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలు, రాజ్యాంగ పరిరక్షణపై కూడా ఆయన విస్తృతంగా పాఠాలు చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. వ్యక్తిగత ఈగోల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షులు తమ ప్రాంతాల్లో కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని, పనిచేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు. దేశ రాజకీయ పరిస్థితులపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని, ఇరాన్ వెనుక చైనా, రష్యా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ విషయంలో ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారని ఆరోపించారు. దేశంలో పెరుగుతున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మరింత చురుకుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. శిక్షణా తరగతులు ముగిసిన అనంతరం రాహుల్ గాంధీ వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో శంషాబాద్ చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం పార్టీ పునర్వ్యవస్థీకరణలో కీలక అడుగుగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.

# "మాకు ఉండడానికి చోటే లేదు"

**జనం వాయిస్, ఖమ్మం, మార్చి 2:**

ఖమ్మం కలెక్టరేట్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతల నేపథ్యంలో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "మాకు ఉండడానికి ఇంకో చోటు కూడా లేదుడ అందుకే ఎక్కడికీ వెళ్లలేక ఇక్కడే ఉన్నాము" అంటూ వారు వాపోయారు. ఆకస్మికంగా జరిగిన కూల్చివేతలతో కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. "అసలు ఏమి జరిగిందని అడిగే నాథుడు కూడా లేడు" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మహిళలు మాట్లాడుతూ, సంవత్సరాలుగా ఇక్కడే నివసిస్తున్నామని, అకస్మాత్తుగా ఇళ్లు కూల్చివేయడంతో చిన్న పిల్లలతో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి వచ్చిందన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత పుట్టిన శిశువుతో సహా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కొంతమంది బాధితులు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము గతంలో ఆయనకు మద్దతుగా పనిచేశామని, కానీ ఇప్పుడు గూడులేకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని, తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇండ్ల కూల్చివేతల అంశంపై అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. బాధిత కుటుంబాలకు పునరావాసం, అవసరమైన సహాయం అందించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

# మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి

- మొదటిపేజీ తరువాయి...

ఫిర్యాదు చేశారు. గత ఏడాదిగా ఏఎన్‌సీ అనే డార్క్ వెబ్ వేదిక ద్వారా తన కూతురికి చాక్లెట్లు, టాబ్లెట్లు పంపించి మాయమాటలతో వేధింపులకు గురిచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆశిష్‌తో పాటు అతని స్నేహితుడు ప్రవీణ్ కూడా వరుసగా లైంగిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. తాను చెప్పినట్టు చేయకపోతే న్యూడ్ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ విషయంపై కాలేజీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. శనివారం విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలికి అవసరమైన వైద్య, మానసిక సహాయం అందిస్తున్నట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## బకాయిలు చెల్లించడంలో

# ప్రభుత్వం ఫెయిల్

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 2:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం వృద్ధులు, ఉద్యోగులు రోడ్లపైకి రావాల్సి రావడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. పీఆర్సీ 2020 బకాయిలను వెంటనే చెల్లించాలని, డీఏ బకాయిలను వాయిదాలుగా కాకుండా ఏకమొత్తంగా ఇవ్వాలని, లీవ్ ఎన్‌కాష్‌మెంట్‌ను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జీపీఎఫ్, జీఐఎస్ నిధులను వడ్డీతో సహా చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో జెండాలతో సంబంధం లేకుండా అందరూ కలిసి పోరాడినట్లే, ఈ రోజు కూడా పార్టీ జెండాలు పక్కన పెట్టి ఉద్యోగుల కోసం ఒక్కటిగా నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, మాటలు గొప్పగా ఉన్నా అమలు మాత్రం కనిపించడం లేదన్నారు. ఆర్థిక శాఖలో నిర్ణయాలు పైస్థాయిలోనే నిలిచిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో అదనపు ఖర్చులపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల విక్రయాలు, ఆర్థిక వనరుల వినియోగంపై పారదర్శకత అవసరమన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను సంఘటితం చేసి పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఇదొక హెచ్చరిక మాత్రమేనని, బకాయిల చెల్లింపులో తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులు, జిల్లా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "ఏఐసీసీ కి ఏటీఎం తెలంగాణ"

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 02:**

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీను ఉద్దేశిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు ఇస్తానని ఇటీవల ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పోస్టు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన పోస్టులో "హలో రాహుల్ గాంధీ.. ఏఐసీసీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం" అంటూ వ్యాఖ్యానించిన కేటీఆర్, "మీరు ఇప్పుడు సీఎం దగ్గర వెయ్యి కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా?" అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. ఇంకా 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఆరు హామీలు, అలాగే ఇతర ఎన్నికల వాగ్దానాల పురోగతిపై కూడా సమీక్ష చేయాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వాగ్వాదం చెలరేగింది.

# "తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది"

**జనం వాయిస్, తిరువనంతపురం/ఖమ్మం, మార్చి 02:**



ఖమ్మం వెలుగుమట్లలో పేదల ఇండ్ల కూల్చివేతల అంశంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో "బుల్డోజర్ రాజ్యం" నడుస్తోందని వ్యాఖ్యానించారు. ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వం 700 ఇళ్లను కూల్చివేసి సుమారు 3,000 మందిని నిరాశ్రయులను చేసిందని ఆరోపించారు. బీజేపీ అమలు చేస్తున్న బుల్డోజర్ విధానాన్ని తెలంగాణలో కాంగ్రెస్ అనుసరిస్తోందని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న చర్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. తెలంగాణలో అణగారిన వర్గాల ఇండ్లను కూల్చి, మరోవైపు కేరళలో ప్రజలతో నిలబడతామని చెప్పడం అవమానకరమని పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చతెస్తాయని అన్నారు. పేదల పునరావాసంపై స్పష్టత ఇవ్వాలని ఆయన సూచించారు.

# ఎడిటోరియల్

## వృద్ధుల సంరక్షణపై బాధ్యత తగ్గుతోందా?.

**వలసలు, ఉద్యోగ ఒత్తిళ్లు, అనుబంధాలపై ప్రభావం.**
**వృద్ధాశ్రమాల పెరుగుదల సమాజానికి హెచ్చరికనా?.**
**విలువలు, విధానాలు సమగ్ర దృష్టి అవసరం.**

మన సంస్కృతిలో వృద్ధులు కుటుంబానికి ఆధారస్తంభాలు. వారి అనుభవం, జ్ఞానం, మార్గదర్శనం తరతరాలకు దిక్సూచిగా నిలిచాయి. ఒకప్పుడు సంయుక్త కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులు, ముత్తాతలు, మనవళ్లు ఒకే గూటిలో జీవించేవారు. సంరక్షణ సహజమైన బాధ్యతగా భావించబడేది. కానీ కాలానుగుణ మార్పులతో కుటుంబ వ్యవస్థ రూపు మార్చుకుంది. అణుకుటుంబాలు పెరిగాయి. జీవనశైలి వేగవంతమైంది. ఈ పరిణామాలు వృద్ధుల సంరక్షణపై ప్రభావం చూపుతున్నాయా అన్న ప్రశ్న సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. ఉద్యోగాల కోసం వలసలు పెరగడం ప్రధాన కారణం. యువత మెరుగైన ఉపాధి కోసం నగరాలకు, విదేశాలకు వెళ్తోంది. తల్లిదండ్రులు స్వగ్రామాల్లో లేదా పాత నివాసాల్లో ఒంటరిగా మిగులుతున్నారు. ఆర్థిక సహాయం అందించినా భావోద్వేగ మద్దతు లోపిస్తోంది. సంరక్షణ అనేది కేవలం ఆర్థిక భద్రత కాదు; సాన్నిహిత్యం, సంభాషణ, సహచర్యం కూడా అవసరం. ఒంటరితనం వృద్ధుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

అణుకుటుంబాల పెరుగుదలతో జీవన విధానం మారింది. ఉద్యోగ ఒత్తిళ్లు, సమయాభావం, పోటీ వాతావరణం కుటుంబ సభ్యుల మధ్య గడిపే సమయాన్ని తగ్గిస్తున్నాయి. వృద్ధులకు అవసరమైన శ్రద్ధ, ఆరోగ్య పర్యవేక్షణ, భావోద్వేగ మద్దతు కొరతగా మారుతున్నాయి. కుటుంబ విలువలు క్రమంగా బలహీనమవుతున్నాయా అన్న సందేహం వ్యక్తమవుతోంది. వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతోంది. కొందరికి అవి అవసరమైన ప్రత్యామ్నాయాలు కావచ్చు. ఆరోగ్య సమస్యలు, ప్రత్యేక సంరక్షణ అవసరం ఉన్నప్పుడు వృద్ధాశ్రమాలు సహాయకంగా ఉంటాయి. కానీ కుటుంబాల్లో సంరక్షణ తగ్గుతోందన్న సంకేతంగా కూడా దీనిని చూడాలి. వృద్ధులను కుటుంబం నుంచి దూరం చేయడం ఒక సామాజిక సమస్యగా మారకూడదు.

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఒంటరితనం, నిరాశ, నిర్లక్ష్య భావన వృద్ధుల్లో ఆందోళన కలిగిస్తోంది. సమాజంలో గౌరవం తగ్గుతోందన్న భావన వారిని బాధిస్తోంది. వృద్ధుల పట్ల సున్నితత్వం అవసరం. వారి అనుభవాన్ని గౌరవించడం సమాజ బాధ్యత. ఇది పూర్తిగా ప్రతికూల దృశ్యమేనని అనుకోవడం సరైంది కాదు. అనేక కుటుంబాలు ఇప్పటికీ వృద్ధుల సంరక్షణను తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నాయి. ఆరోగ్య బీమా, వైద్య సదుపాయాలు, పెన్షన్ పథకాలు వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోంది. కానీ భావోద్వేగ అనుబంధం తగ్గకూడదు. సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ సమయాన్ని కేటాయించాలి.

ప్రభుత్వ విధానాలు కూడా కీలకం. వృద్ధుల సంక్షేమ పథకాలు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతా చర్యలు బలోపేతం చేయాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వృద్ధులకు అనుకూల వాతావరణం కల్పించాలి. వృద్ధుల కోసం దిన సంరక్షణ కేంద్రాలు, సామాజిక కార్యక్రమాలు పెంచాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వృద్ధుల జీవితంలో సానుకూల మార్పు తీసుకురాగలదు. దూర ప్రాంతాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రులతో తరచుగా మాట్లాడేందుకు వేదికలు ఉన్నాయి. కానీ సాంకేతిక సంబంధం ప్రత్యక్ష అనుబంధాన్ని భర్తీ చేయలేదన్న విషయం గుర్తుంచుకోవాలి.

మొత్తంగా వృద్ధుల సంరక్షణ ఒక కుటుంబ విలువ మాత్రమే కాదు; ఒక సామాజిక బాధ్యత. ఆధునిక జీవనశైలిలో మార్పులు వచ్చినా అనుబంధాలు కోల్పోవద్దు. వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి. వారి సంరక్షణను భారంగా కాకుండా కృతజ్ఞతగా చూడాలి. కుటుంబాలు, సమాజం, ప్రభుత్వం కలిసి ముందుకు సాగితేనే వృద్ధుల జీవితం గౌరవప్రదంగా, సురక్షితంగా ఉంటుంది. ఉద్యోగాల కోసం వలసలు పెరగడం ప్రధాన కారణాల్లో ఒకటి. యువత ఉపాధి అవకాశాల కోసం నగరాలకు, విదేశాలకు వెళ్తోంది. ఫలితంగా తల్లిదండ్రులు గ్రామాల్లో లేదా పాత నివాసాల్లో ఒంటరిగా మిగులుతున్నారు. ఆర్థికంగా సహాయం అందుతున్నా, భావోద్వేగ పరమైన ఖాళీ పెరుగుతోంది. సంరక్షణ కేవలం డబ్బుతో పూర్తికాదని ఈ పరిస్థితి గుర్తు చేస్తోంది.

అణుకుటుంబాల పెరుగుదలతో జీవనశైలి మారింది. పనిభారం, సమయాభావం, పోటీ వాతావరణఖ్రీశ్రీ ఇవి కుటుంబ సభ్యుల మధ్య గడిపే సమయాన్ని తగ్గిస్తున్నాయి. వృద్ధులకు అవసరమైన శ్రద్ధ, సంభాషణ, సహచర్యం కొరతగా మారుతోంది. ఇది మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఒంటరితనం, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయన్న ఆందోళన ఉంది. వృద్ధాశ్రమాల పెరుగుదల మరో ముఖ్య సంకేతం. కొందరికి అవి అవసరమైన ప్రత్యామ్నాయాలు కావచ్చు. కానీ కుటుంబాల్లో సంరక్షణ తగ్గుతోందన్న భావన కూడా కలుగుతోంది. వృద్ధుల సంరక్షణను కేవలం సంస్థల బాధ్యతగా చూడలేం. అది కుటుంబం, సమాజం కలసి తీసుకోవాల్సిన బాధ్యత.

ఇది పూర్తిగా ప్రతికూల దృశ్యమేనని అనుకోవడం సరైంది కాదు. చాలా కుటుంబాలు ఇప్పటికీ వృద్ధుల సంరక్షణను తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నాయి. ఆరోగ్య బీమా, వైద్య సదుపాయాలు, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో మెరుగుదల కూడా కనిపిస్తోంది. కానీ భావోద్వేగ మద్దతు తగ్గకూడదు. ప్రభుత్వ విధానాలు కూడా కీలకం. వృద్ధుల సంక్షేమ పథకాలు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతా చర్యలు అవసరం. వృద్ధులకు అనుకూల వాతావరణం కల్పించే సామాజిక కార్యక్రమాలు పెరగాలి. సమాజంలో గౌరవం, సహనం, కృతజ్ఞత వంటి విలువలు బలపడాలి. మొత్తంగా వృద్ధుల సంరక్షణ ఒక కుటుంబ విలువ. ఆధునిక జీవనశైలిలో మార్పులు వచ్చినా, అనుబంధాలు కోల్పోవద్దు. వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి. వారి సంరక్షణను బాధ్యతగా కాకుండా కృతజ్ఞతగా చూడాలి. కుటుంబాలు, సమాజం, ప్రభుత్వం కలిసి ముందుకు సాగితేనే వృద్ధుల జీవితం గౌరవప్రదంగా ఉంటుంది.

# గ్రహణం ఏ రాశి..ఏం చేయాలి

**ఫాల్గుణ శుక్లపూర్ణిమ సంపూర్ణ చంద్ర గ్రహణం 2026 మార్చి 03 మంగళవారం ఏర్పడుతోంది. పంచాంగం ప్రకారం గ్రహణ సమయం, ఇతర వివరాలు ఇలా ఉన్నాయి.**

**సంపూర్ణ చంద్ర గ్రహణం గ్రహణం స్పర్శకాలం – మధ్యాహ్నం గంవ 3.19 నివ**

**సంపూర్ణ చంద్ర గ్రహణం నిమీలనకాలం – 4.33**

**సంపూర్ణ చంద్ర గ్రహణం మధ్యకాలం – 5.03**

**మార్చి 3 సూర్యస్తమయ సమయం – 6 గంటల 2 నిముషాలు**

**మార్చి 3 చంద్రోదయ సమయం – 6 గంటల 4 నిముషాలకు**

**సంపూర్ణ చంద్ర గ్రహణం ఉన్మీలన కాలం – 5.32**

**సంపూర్ణ చంద్ర గ్రహణం మోక్షకాలం – 6.46**

**సంపూర్ణ చంద్ర గ్రహణం బింబ దర్శనకాలం – 59 నిముషాలు**

చంద్రగ్రహణ సమయం 42 నిమిషాలు మాత్రమే ఉంటుంది. సంపూర్ణ చంద్రగ్రహణం అయినప్పటికీ విడుపు సమయంలో 42 నిమిషాలు మాత్రమే బింబం కనిపిస్తుంది. అందుకే సూర్యాస్తమయం సమయం అయిన 6 గంటల 2 నిముషాలకు పట్టుస్నానం.. 6 గంటల 46 నిముషాలకు విడుపుస్నానం చేయాలి. గ్రహణం ప్రారంభమైన 3 గంటల 19 నిముషాల నుంచి స్నానం చేయాల్సిన అవసరం లేదు. అయితే భోజనం మధ్యాహ్నం 12 గంటల లోపు ముగించేయడం మంచిది

మార్చి 3న ఏర్పడుతున్న సంపూర్ణ చంద్రగ్రహణం పుబ్బ నక్షత్రం, సింహరాశిలో సంభవిస్తోంది. అందుకే పుబ్బ నక్షత్రం వారు, సింహరాశివారు ఈ గ్రహణం చూడరాదు. ఉత్తర గోళం, అపసవ గ్రహణం, కేతుగ్రస్తం, నీలపింగళవర్ణం, మిశ్రమవర్ణంలో ఉంటుంది. ఈ గ్రహణం తూర్పు దిక్కున ప్రారంభమై.. తూర్పు ఆగ్నేయంలో నిమీలనం... దక్షిణ నైరుతిలో ఉన్మీలనం చెంది పశ్చిమం దగ్గర మోక్షం



కలుగుతుంది. మనకు స్పర్శ, నిమీలనం, ఉన్మీలనములు కన్పించవు. మోక్షకాలమే దర్శనమిస్తుంది.

సంపూర్ణ చంద్రగ్రహణం పూర్తైన తర్వాత 6 గంటల 46 నిముషాలు దాటిన తర్వాత ఆహారం తీసుకోవాలి. గర్భిణిలు సాయంత్రం 5 గంటల నుంచి 6.46 వరకూ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది

ఏ రాష్ట్రంలో సంపూర్ణ చంద్ర గ్రహణం ఎంత సేపు కనిపిస్తుంది?

మార్చి 3న ఏర్పడుతున్న సంపూర్ణ చంద్రగ్రహణం ఈశాన్యరాష్ట్రాల్లో కనిపిస్తుంది. ముంబైలో చంద్రోదయం సా.6.45 పశ్చిమ ప్రాంతములందు కన్పించదు. మోక్షకాలంలోనూ గ్రహణం అక్కడ కనిపించదు. లక్షద్వీపంలోని కవరత్తీ, గుజరాత్ లో ద్వారకలో ఈ గ్రహణం కనిపించదు. కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో 8 నిముషాలు, అహ్మదాబాద్లో 3 నిముషాలు, గాంధీనగర్ లో 3 నిముషాలు, పనాజీలో 7 నిముషాలు, శృంగేరీలో 11 నిముషాలు, ఉదయపూర్లో 8 నిముషాలు, గుజరాత్ వడోదరాలో 5 నిముషాలు కనిపిస్తుంది.

తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం సమయం తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే సంపూర్ణ చంద్రగ్రహణం హైదరాబాద్ లో 24 నిముషాలు, విజయవాడలో 36 నిముషాలు, నల్గొండలో 27 నిముషాలు, నెల్లూరులో 28 నిముషాలు కనిపిస్తుంది

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయాలు ఉదయం నుంచి మూసివేసి మోక్షకాలం తర్వాత తెరిచి సంప్రోక్ష్య కార్యాలు నిర్వహిస్తారు.

**సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఏ రాశిపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?**

**మేష రాశి - మానసిక అశాంతి**
**వృషభ రాశి - సుఖం**
**మిధున రాశి - లాభం**
**కర్కాటక రాశి - వ్యయం**
**సింహ రాశి- ఘాతం**
**కన్యా రాశి - హాని**
**తులా రాశి - ధనలాభం**
**వృశ్చిక రాశి - వ్యధ**
**ధనస్సు రాశి - చింత**
**మకర రాశి- సౌఖ్యం**
**కుంభ రాశి - స్త్రీ కష్టం**
**మీన రాశి - అతి కష్టం**

# భారత్-కెనడా సంబంధాలకు కొత్త ఊపు

**ప్రధాని కార్నీ తొలి భారత పర్యటన.**
**ద్వైపాక్షిక బంధాలకు కొత్త శక్తి.**
**ప్రజల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం.**

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మార్చి 02:**

భారతదేశానికి కెనడా ప్రధాని మార్క్ కార్నీ తొలి పర్యటనకు రావడం పట్ల భారత్ ఆనందం వ్యక్తం చేసినట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇది భారత్‌కెనడా సంబంధాల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ప్రధాని కార్నీ ప్రజా జీవితంలో సాధించిన విజయాలు ప్రేరణాత్మకమని మోదీ పేర్కొన్నారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే ముందు నుంచే



ఆయన సాధించిన అనుభవం, నాయకత్వ నైపుణ్యం ప్రశంసనీయమని అన్నారు. తమ మొదటి సమావేశం నుంచే రెండు దేశాల మధ్య స్నేహబంధానికి కొత్త ఉత్సాహం, పరస్పర విశ్వాసం పెరిగిందని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై చర్చలు సాగాయని మోదీ వెల్లడించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత వంటి రంగాల్లో సహకారం విస్తరించాలనే దిశగా చర్చలు జరిగాయని సమాచారం. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలనే సంకల్పాన్ని ఇరు నేతలు వ్యక్తం చేశారు. భారత్‌కెనడా స్నేహబంధం ప్రజల అభివృద్ధి, శాంతి, స్థిరత్వానికి దోహదపడేలా ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరింత సన్నిహిత సహకారంతో సంబంధాలను కొత్త దశకు తీసుకెళ్తామని తెలిపారు.

# ఐఏఎస్ అధికారులతో రాష్ట్రపతి భేటీ

**ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏలో శిక్షణ పొందుతున్న అధికారుల మర్యాదపూర్వక సమావేశం.**
**ప్రజాసేవలో ఉన్నత ప్రమాణాలు పాటించాలని సూచన.**
**'దేశమే ముందుగా' భావనతో పనిచేయాలని పిలుపు.**

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మార్చి 02:**

రాష్ట్ర పౌర సేవల నుంచి భారత పరిపాలనా సేవలోకి నియమితులై 128వ ప్రవేశ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న ఐఏఎస్ అధికారులు రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె అభినందనలు తెలియజేశారు. సామూహిక ప్రొఫెషనలిజం, సమన్వయం, కట్టుబాటు అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలకమని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్నత ప్రమాణాలను నిలబెట్టడం ప్రతి అధికారికీ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడటం పరిపాలనా వ్యవస్థకు అత్యంత ముఖ్యం అని తెలిపారు. తమ అనుభవాన్ని సమర్థంగా వినియోగించుకుని 'దేశమే ముందుగా' అనే భావనను మార్గదర్శకంగా తీసుకుని పనిచేయాలని



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారులకు సూచించారు. ప్రజల సంక్షేమమే పరిపాలనా వ్యవస్థ యొక్క పరమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# ఆర్థిక మంత్రితో ఏఐఐబీ అధ్యక్షురాలి భేటీ



**జనం వాయిస్, న్యూఢిల్లీ, మార్చి 02:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు న్యూఢిల్లీలో ఏషియన్ మౌలిక వసతుల పెట్టుబడి బ్యాంక్ కొత్త అధ్యక్షురాలు జౌ జియాయితో సమావేశమయ్యారు. భారత్‌ఏఐఐబీ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం పై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ఏఐఐబీలో రెండో అతిపెద్ద వాటాదారుడిగా ఉన్న భారత్ తరఫున మాట్లాడిన ఆర్థిక మంత్రి, సభ్య దేశాల్లో ముఖ్యంగా తక్కువ ఆదాయ దేశాల్లో పెట్టుబడులను విస్తరించాల్సిన అవసరాన్ని రేఖాంకితం చేశారు. వినూత్న ఆర్థిక, అనాధికారిక పరికరాల ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి మరింత మద్దతు అందించాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల ఆధారిత అభివృద్ధిపై భారత్ నిరంతర దృష్టి సారిస్తున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. భారత్‌లో మౌలిక వసతుల రంగంలో ముందస్తు సేవల ద్వారా ఏఐఐబీతో మరింత సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో పెండింగ్ ప్రాజెక్టుల ఆమోదాలను వేగవంతం చేయాలని కోరారు. ఇక భారత్‌లో ఏఐఐబీ కార్యకలాపాల విస్తృతిని దృష్టిలో ఉంచుకుని ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. మూలధన మార్కెట్ల అభివృద్ధిలో ఏఐఐబీ పాత్ర కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.



## దళిత బందు రెండో విడత గ్రౌండింగ్

# ప్రక్రియ వేగవంతం చేయాలి

**- ప్రజావాణిలో కలెక్టర్ కి వినతి పత్రం అందించిన దళితబందు సాధన సమితి**

**జనం వాయిస్, జమ్మికుంట:**

దళితబందు సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా దళితబంధు పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది.రెండు నెలలు గడిచినా గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభించడం లేదు సుమారు 5200 లబ్ధిదారులు ఉండగా 10 నెలల సమయలో కేవలం 1200 మందికి మాత్రమే మంజూరు చేయడం జరిగింది. మిగిలిన 5000 కుటుంబాలకు రెండవ విడత మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారనిగతంలో రోడ్డెక్కి అనేక నిరసన కార్యక్రమాలు చేస్తేనే ప్రభుత్వం స్పందించి మళ్లీ రోడ్డెక్కి పోరాటం చేస్తేనే ప్రభుత్వం స్పందిస్తుందని,అంటే మళ్లీ రోడ్డు ఎక్కడానికి హుజురాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారు. అని కావున వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం అని లేనిపక్షంలో హుజురాబాద్ దళితబంధు లబ్ధిదారులతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు కొలుగూరి నరేష్ సరిగొమ్ముల విజయ్ జీడి అరుణ బండారి ప్రశాంత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలి

**- కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు**

**జనం వాయిస్, హుజూరాబాద్:**

కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన చిత్రా మిశ్రా ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్, జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఫెడరేషన్ డైరీని కలెక్టర్ కు అందించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కలెక్టర్ కు వివరించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గాదె కరుణాకర్ రావు, నరేందుల ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, నాయకులు సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘనంగా శ్రీ పాదరావు 89వ జయంతి వేడుకలు



**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోపట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో శివాలయం బొమ్మల గుడిలో స్వర్గీయ శ్రీ పాదరావు 89వ జయంతి సందర్భంగా మహా అన్నదానం చేయడం జరిగింది. అనంతరం తిరిగి గాంధీ చౌరస్తాలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుంకరి రమేష్ మాట్లాడుతూ స్వర్గీయ శ్రీ పాద రావు గారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో 1935 మార్చి 2 లో జన్మించి వారు పదవ తరగతి వరకు మంథని లో పూర్తిచేసి ఉన్నత విద్య కోసం హైదరాబాద్ చేరారు, ఆ తర్వాత అదిలాబాదులో పంచాయతీ ఇన్స్పెక్టర్ గా పని చేశారు. పంచాయతీ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన అనుభవం ఆయనకు గ్రామ పరిపాలనపై స్పష్టమైన అవగాహన కలగడంతో పేద ప్రజలకు ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో నాగపూర్ లో న్యాయ శాస్త్రం చదివి న్యాయవాదిగా సేవలందించారు. రైతు కష్టాలు పల్లె ప్రజల ఆవేదనలు ఆయనకు ప్రత్యక్ష అనుభవాలయ్యాయి. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన లేనప్పటికీ ఆ ప్రాంత ప్రజలు శ్రీపాదరావు నాయకత్వాన్ని కోరగా, ఆయన వరుసగా రెండుసార్లు సర్పంచిగా ఎన్నికై, మహదేవ్పూర్ సమితి అధ్యక్షుడిగా, మంథని ల్యాండ్ మార్ట్ గేజ్ బ్యాంకు చైర్మన్ గా పనిచేశారు. ఈ దశలోనే ఆయన ప్రజా నాయకుడిగా ఒక్కో మెట్టు పైకి ఎదిగి 1983లో తెలుగుదేశం ప్రభంజనం మధ్య కాంగ్రెస్ అభ్యర్థిగా మంథని నుంచి పోటీ చేసి విజయం సాధించడం సాధారణ విషయం కాదు, ప్రజల విశ్వాసం ఆయనకు రాజకీయ బలంగా మారింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంథని నియోజక వర్గం అభివృద్ధికి నిబద్ధతతో కృషిచేసి రహదారులు, సాగునీటి సదుపాయాలు విద్యాసంస్థలు సంక్షేమ పథకాలు ఇలా ఆయన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి మంథని రూపురేఖలు మార్చారు. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవం అని చెప్పక తప్పదు. అదేవిధంగా ఈ ప్రాంతం నుండి ఎంతోమందికి రాజకీయ గురువుగా వారు చిరస్థాయిగా నిలిచిపోయారు.వారిఅడుగుజాడల్లో వారి కుమారులైన ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు , తెలంగాణ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరముగా శ్రమిస్తూ సేవలందిస్తున్న దుద్దిల్ల కుటుంబ సభ్యులకు తెలంగాణ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు సారంగపాణి, ఫిషరీష్ రాష్ట్ర కమిటీ సభ్యులు పింగిలి రాకేష్, మరియు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్స్ చందారాజు,దిడ్డి రాము, ఒగ్గు రమేష్ ,మాచర్ల రాజు గౌడ్, కుతాడి తిరుపతి,పాతకాల మౌనిక అనిల్,యాట్ల సునీత అశోక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎండి సలీం, ఎగ్గని శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకులు పర్లపెల్లి నాగరాజ్,ఎండి సజ్జు, పంజాల అజయ్, పాతకాల రమేష్,శ్రీకాంత్, దొడ్డే సదానందం,రాజు, పవన్, ప్రవీణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# హుజూరాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు సన్మానం.



**జనం వాయిస్,హుజూరాబాద్:**

ఎల్ఐసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బి. సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు సమాజ సేవలో ముందుండడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఛైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఆఫీసర్ బి. హాలు, సెక్రటరీ ఆర్. కుమార్, అసోసియేషన్ సిబ్బంది మేకల ప్రేంకుమార్, ఎమ్. వివేక్, వి. కరుణాకర్ పాల్గొన్నారు. అలాగే ఎల్ఐసి ఏజెంట్లు ఎమ్. శ్రీనివాస్, భాస్కర్, ఏ. శ్రీనివాస్, స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ ఫెరోజ్ ను ఘనంగా సన్మానించిన

**- కేరళ పాఠశాల కరెస్పాండెంట్ KS బెన్నీ**



**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ పురపోరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి కౌన్సిలర్ గా ఘన విజయం సాధించిన ఫెరోజ్ కి నేడు తాను చిన్ననాటి నుండి చదువుకున్న " "కేరళ మోడల్ హై స్కూల్" యాజమాన్యం పాఠశాలకి ఆహ్వానించి ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. పాఠశాల కరెస్పాండంట్ బెన్నీ మాట్లాడుతూ.. తమ పూర్వ విద్యార్థి ఫిరోజ్ చిన్ననాటి నుండి క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత చదువులు చదివి నేడు రాజకీయం వైపు అడుగులు వేసి ప్రజల మన్ననలు పొంది దీ-ఫార్మ్ ఇవ్వకపోయినా పట్టుదలతో ఇండిపెండెంట్ గా పోటీ చేసి కౌన్సిలర్ గా విజయం సాధించడం అనేది మా విద్యాసంస్థకి గర్వకారణంగా భావిస్తున్నాం అని కొనియాడారు.ఒక సామాన్యుడు పట్టుదలతో కష్టపడితే విజయం తమ సొంతం అవుతుంది అనే ఒక ఉదాహరణ కూడా ఫెరోజ్ సెట్ చేసాడు అని అన్నారు.అనంతరం ఫిరోజ్ మాట్లాడుతూ తాను చిన్ననాటి నుండి చదివిన పాఠశాల అసెంబ్లీ లో పాల్గొనడం మరియు తరగతి గదులను చూస్తూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మరియు ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేను చిన్ననాటి నుండి ఇదే స్కూల్ లో 10వ తరగతి వరకు చదువుకున్నాను, నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ మరియు సేవా భావం నేను ఇదే కేరళ స్కూల్ లో నా గురువులు నాకు నేర్పారు వారి నుండే నేను సేవా భావం అలవర్చుకున్నాను "హార్డ్ వర్క్ నెవెర్ ఫెయిల్స్" కష్టపడి చదవాలని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని తల్లిదండ్రులను ఉన్నతంగా చూసుకోవాలని, క్రమశిక్షణ మరియు క్యారెక్టర్ బాగుంటే మన జీవితాల్లో చాలా గొప్ప మార్పులు వస్తాయని చెప్పుకొచ్చారు. కష్టం లేనిది ఫలితం ఆశించలేమని. కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుతాం అని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి

## జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ డిమాండ్.**
**అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి.**
**ఉపకులాల సమస్యలపై జాగృతి ఉద్యమం.**





**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 2:**

రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్లు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉపకులాల నాయకులతో సమావేశం నిర్వహించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని ఆమె కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియలో భాగంగా కేంద్రం చేపట్టే జనగణన పూర్తై అధికారిక లెక్కలు వెలువడిన తర్వాత రిజర్వేషన్ల పెంపు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు అంశంపై అసెంబ్లీలో స్పష్టమైన తీర్మానం ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ తగిన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర అభివృద్ధి కోసం ఉపకులాల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఎస్సీ ఉపకులాలతో కలిసి రిజర్వేషన్ల పెంపు సహా వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని కవిత తెలిపారు. ముఖ్యంగా కొన్ని ఉపకులాలకు కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన గోన విష్ణువర్ధన్ రావు

**జనం వాయిస్, ఎర్రవెల్లి, మార్చి 02:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోన విష్ణువర్ధన్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎర్రవెల్లి నివాసంలో కుటుంబ సమేతంగా కేసీఆర్‌ను కలిసి, తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహానికి హాజరై ఆశీర్వదించాలని ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



# సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జి పనుల్లో భద్రతా లోపాలు

- **గిర్డర్ల అమరికలో నిర్లక్ష్యం ఆరోపణలు.**
- **వాహన రాకపోకల నియంత్రణ లేక ప్రజల ఆగ్రహం.**
- **ప్రమాదానికి దారితీసే పరిస్థితులపై ఆందోళన.**



**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 02:**

సంతోష్‌నగర్‌చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ ఐరన్ గిర్డర్లను క్రేన్ల సాయంతో అమర్చుతున్న సమయంలో కిందుగా వాహనాల రాకపోకలు కొనసాగడం ప్రమాదానికి దారితీసే పరిస్థితులను సృష్టిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో తగిన హెచ్చరిక బోర్డులు, భద్రతా తాడులు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు కనిపించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ గిర్డర్లు ఎత్తి అమర్చే సమయంలో కింద వాహనాలు వెళ్లడం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని చెబుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేసి లేదా మళ్లించి పనులు చేపట్టాల్సిందని వారు సూచిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పనులు పూర్తయ్యే వరకు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

# హోలీ ప్రశాంతంగా జరుపుకోండి: సజ్జనర్

## ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాల మూసివేత

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 2:**



నగరంలో హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి సీ సజ్జనర్ సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ నుంచి సోమవారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బ్లూ కోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ కాయాలని చెప్పారు. ఇష్టం లేని వారిపై బలవంతంగా రంగులు పూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పాదచారులు, వాహనాలపై రంగులు చల్లవద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై నగరవ్యాప్తంగా మఫ్టీలో షీ టీమ్స్ నిఘా ఉంటుందని తెలిపారు. ప్రజలు రసాయన రంగులకు బదులు సహజసిద్ధమైన రంగులు వాడాలని సూచించారు. వేడుకల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని పేర్కొన్నారు. రోడ్లపై యువకులు గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లింల ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని, పీస్ కమిటీల సమన్వయంతో పోలీసులు పనిచేయాలని ఆదేశించారు. హోలీ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిటీ పోలీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, పోలీసులకు సహకరించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని నగర ప్రజలను కోరారు.

## వర్షాకాలానికి ముందే రోడ్డు పూర్తి చేయాలి.

# కొండా సురేఖ

**జనం వాయిస్, వరంగల్, మార్చి 02:**



వరంగల్ పర్యటనలో భాగంగా 33వ డివిజన్‌లో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ప్రాంతంలో రహదారి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వివరించగా, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన రోడ్డు నిర్మాణానికి అవసరమైన పరిపాలనా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు ప్రారంభమైతే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆలస్యం లేకుండా పనులు పూర్తి చేయాలని కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ తెలిపారు.




# ఐటీ కారిడార్‌లో రూ.600 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

**జనం వాయిస్, రంగారెడ్డి, మార్చి 02:**

ఐటీ కారిడార్‌కు ఆనుకుని గంధంగూడలో ఉన్న 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. ఈ భూమి విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నంబర్ 86/పి పరిధిలోని ఈ భూమిని ప్రభుత్వం జలమండలికి కేటాయించింది. అయితే ఆ స్థలంలో కొంతకాలంగా వివిధ పేర్లతో ఆక్రమణలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. కొందరు షెడ్డులు నిర్మించి భూమిని కబ్జా చేసినట్లు సమాచారం. జలమండలి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇది సీవరేజ్ శుద్ధి కేంద్రం ఏర్పాటు కోసం కేటాయించిన భూమి అని నిర్ధారించారు. అక్రమంగా నిర్మించిన షెడ్డులను తొలగించి, మొత్తం 6.30 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలమని స్పష్టం చేస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో హైడ్రా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ఇందిరమ్మ చీరల కొత్త నమూనాల సమీక్ష

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 2:**

రాబోయే ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయనున్న ఇందిరమ్మ మహిళా శక్తి యూనిఫాం చీరల కొత్త నమూనాలను మంత్రి సీతక్క మరియు సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి దివ్య దేవరాజన్ సమీక్షించారు. చీరల డిజైన్లు, నాణ్యత, రంగుల ఎంపికపై అధికారులతో కలిసి చర్చించారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా ఉండేలా నమూనాలను రూపొందించాలని సూచించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని, సమయానికి పంపిణీ జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ఈ పథకం తోడ్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.



# సూరారం గ్రామంలో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

**- కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసిన గ్రామశాఖ అధ్యక్షుడు చల్ల రమేష్ రెడ్డి**

**జనం వాయిస్, మహాదేవపూర్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను సూరారం గ్రామశాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మంథని ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన శ్రీపాదరావు స్పీకర్‌గా పనిచేశారన్నారు. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన శ్రీపాదరావు సర్పంచ్‌గా, సమితి ఉపాధ్యక్షుడిగా ఎల్ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1983 నుంచి వరుసగా మూడుసార్లు మంథని ఎమ్మెల్యేగా గెలిచారు. 1999 ఏప్రిల్ 13న మహాదేవపూర్ మండలం అన్నారం సమీపంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్లు హత్య చేశారు. సర్పంచ్ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, శాసనసభ్యుడిగా,



శాసన సభాధిపతిగా పదవి చేపట్టి పదవికే వన్నె తెచ్చారని అన్నారు. రాష్ట్రానికి ఎనలేని సేవచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుగాంచారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల శంకరమ్మ, ఉప సర్పంచ్ చిన్నన్న, మాజీ ఉప సర్పంచ్ రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, తులసి మహేష్, మనిషి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద వైద్య విద్యార్థులకు ఆర్థిక చేయూత.

## ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి.

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 02:**

ఉప్పల్ నియోజకవర్గ పేద వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి 11 మంది విద్యార్థులకు ఆరు లక్షల రూపాయల చెక్కులు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ బీ.సీ రాజు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధమని పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ప్రతిభావంతుల విద్యార్థులకు బి. ఎల్ .ఆర్ చారిటబుల్ ట్రస్టు అండగా నిలుస్తుందని అన్నారు గతంలో పేద విద్యార్థులకు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశామని అన్నారు. వైద్య విద్య ద్వారా అభ్యసించే విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని పేద ప్రజలకు సేవ చేసే విధంగా వారు కూడా ముందుకు రావాలని ఆకాంక్షించారు. బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా "సీటు మీది ఫీజు నాది" అనే నినాదంతో



ఉప్పల్ శాసన, సభ్యులు బండారి లక్ష్మారెడ్డి పేద మధ్యతరగతి విద్యార్థులకు ట్రస్టు ద్వారా చేయూతని అందిస్తున్నారు. విద్యా, వైద్యం ప్రతి ఒక్కరికి చదువుకునే భవిష్యత్తులో మధ్యలోనే ఆపివేయకుండా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాల కొనసాగించామని తద్వారా పేద విద్యార్థులకు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జి. హెచ్.ఎం.సి అధికారులు, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దుద్దిల్ల శ్రీధర్ బాబు యువసేన ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు.

**జనం వాయిస్, కరీంనగర్:**

దుద్దిల్ల శ్రీధర్ బాబు యువసేన అధ్యక్షులు నారోజు రాకేష్ చారి ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతిని కరీంనగర్ లోని కార్ఖానాగడ్డలో మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పెన్నులు , ఎగ్జామ్ ప్యాడ్లను ఇచ్చి ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీధర్ బాబు యువసేన అధ్యక్షులు నారోజు రాకేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు మొట్టమొదటి స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు, రాష్ట్రాల అభివృద్ధికై ఎంతో కృషి చేసినటువంటి మహోన్నత వ్యక్తి శ్రీపాద రావు, ఆయన అడుగుజాడల్లో ఆశయాలతోనే స్నేహ భావశీలతోనే ముందుకు కొనసాగుతున్నటువంటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎందరుకో మార్గదర్శకమైన శ్రీధర్ బాబు




అడుగుజాడల్లో అనేక సామాజిక సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొగ్గలి శ్రీధర్, కారెంగుల రవి, వాయిల రాజ్ కుమార్, బండి క్రాంతి, బోయిని ప్రశాంత్, సంజయ్, బియ్యం తిరుపతి తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈజీఎస్ కార్యాలయం ముందే సగం కాలిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు

○ గడువు ముగిసిందని మంటల్లో కాల్చిన సంబంధిత అధికారులు.
○ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఆగ్రహం.








**జనం వాయిస్, మంథని:**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గత సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు అందించిన ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు గడువు ముగిసిసింది అని ఈజీఎస్ కార్యాలయం ముందే కాల్చివేసిన సంబంధిత అధికారులు మంథని మండలంలోని పలు గ్రామాల్లో గత సంవత్సరంలో ఉపాధి కూలీలకు పంపిణీ చేయాల్సిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరైన సమయంలో సరిపడా అందించకుండా గడువు ముగిసింది అన్న నెపంతో ఇలా కార్యాలయం ముందే కాల్చి వేసిన దృశ్యం ఉపాధి కూలీలలో ఆగ్రహాన్ని నింపుతుంది గత సంవత్సరంలో ఉపాధి కూలీలు తీవ్ర ఎండలో పనిచేసినప్పటికీని సంబంధిత అధికారులు ఏ ఒక్క గ్రామంలో కూడా ఉపాధి కూలీలకు సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయలేదని అలా పంపిణీ చేయకపోవడం వల్ల ఎండ దెబ్బతో మండలంలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలు కూడా మరణించారని ఈ విధంగా సంబంధిత కార్యాలయంలో గడువు ముగిసిందని ఆ గడువు ముగిసినటువంటి ఓఆర్ఎస్ ప్యాకెట్లను కార్యాలయం ముందే సగం కాల్చివేశారు ప్రభుత్వ సొమ్ము కూలీలకు పంచాల్సింది పోయి ఈజీఎస్ కార్యాలయం ముందే కాల్చివేసిన సంబంధిత అధికారులు గతంలో ఉపాధి కూలీలకు సరిపడా ఓ ఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయలేదని ఈజీఎస్ కార్యాలయం పై విచారణ చేసి ఉపాధి కూలీలకు చెందాల్సినటువంటి ప్రభుత్వ సొమ్మును ఇలా మంటల్లో కాల్చివేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆ కార్యాలయానికి వచ్చే ఉపాధి కూలీలు ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

# 'ఊషన్నపల్లిలో ఘనంగా హోలీ సంబరాలు'

**జనం వాయిస్, పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తుగా పాఠశాల పిల్లలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు రకరకాల రంగులను ఒంటిపై చల్లుకుంటూ, ముఖానికి పూసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలు మన దేశ వారసత్వ సంపదలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పిల్లలు సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూనే శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పిల్లల ఆనందం, వారి మానసిక వికాసం కోసం ఇలాంటి వినూత్న కార్యక్రమాలను పాఠశాలలో



నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని డబ్బులు పెట్టి కొనుక్కునే చదువులు మనకొద్దని, సకల సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్యనందించే సర్కారు బడి చదువులే మేలని, అందువల్ల పిల్లలందరినీ ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చదివించాలని ఆయన తల్లిదండ్రుల్ని కోరారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, ఉపాధ్యాయినులు మంద శ్రీవాణి, ఎడ్ల స్రవంతి, గోపిశెట్టి సుప్రియ, విద్యార్థినీ, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

# జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికేట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం.

**జనం వాయిస్, కరీంనగర్:**

కరీంనగర్ లోని స్థానిక ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కావున, ఆసక్తి గల అభ్యర్థులు 10 మార్చి 2026 లోగా తమ దరఖాస్తులను తెలుగు విభాగంలో సమర్పించగలరని కోర్స్ సమన్వయకర్త డా. బూర్ల చంద్రశేఖర్ తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని తెలుగు విభాగంలో సంప్రదించాలని కోరారు.

# మహనీయుల జీవితాలు మనకు వ్యక్తిత్వ వికాస పాఠాలు.

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**జనం వాయిస్, పెద్దపల్లి, మార్చి 02:**

మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలలో డిసిపి రాంరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. దుదిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన



మహనీయులు దుద్దిల శ్రీపాదరావు అని, న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని, నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న వ్యక్తి శ్రీపాద రావు అని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యంశాల నుంచి మనం వ్యక్తిత్వ వికాస పాఠాలు అనేకం నేర్చుకోవచ్చని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక మంది స్థానిక నాయకుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, అదే రీతిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దుద్దిల్ల శ్రీపాద రావు గారి జయంతి జరుపుకోవడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా తగ్గిన టమాటా ధరలు

తెలుగు రాష్ట్రాల్లో టమాటా సాగు చేసిన రైతులకు ప్రస్తుతం గడ్డు పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో సాగుదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ధరకే టమాటా లభిస్తున్నప్పటికీ, రైతులకు మాత్రం పెట్టిన ఖర్చు కూడా తిరిగి రాకపోవడం బాధాకరంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం 50 రూపాయలకు సుమారు 4 కిలోల వరకు టమాటా విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా అనకాపల్లి జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆదివారం నమోదైన గణాంకాల ప్రకారం 30 కిలోల బరువు ఉన్న ఒక టమాటా బాక్స్ కేవలం 90 రూపాయలకు మాత్రమే అమ్ముడైంది. అంటే కిలోకు సుమారు 3 రూపాయల ధర మాత్రమే పలుకుతోంది. ఈ స్థాయి ధరలతో కోత ఖర్చులు, రవాణా వ్యయం కూడా రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంట సాగు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, గత 15 రోజులుగా కోతలు ముమ్మరం కావడంతో ఒకేసారి భారీగా సరుకు మార్కెట్‌కు చేరింది. సరఫరా ఎక్కువగా ఉండటం, గిరాకీ తగ్గిపోవడం వల్ల ధరలు క్షీణించాయి. అదనంగా శీతలీకరణ గిడ్డంగుల కొరత రైతులకు ఇబ్బందిగా మారింది. నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవడం తప్ప మరో మార్గం లేకుండా పోతోంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. సరైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్ స్థిరపడే వరకు రైతులకు ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.



# బంగారం దూసుకుపోయింది

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అమెరికాఇజ్రాయెల్ దాడులు, వాటికి ప్రతిగా ఇరాన్ చర్యలతో అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులవైపు మళ్లడంతో బంగారం ధరలు వరుసగా రికార్డు స్థాయిలను తాకుతున్నాయి. కేవలం రెండు రోజుల్లోనే పసిడి ధరలు ₹1,500కు పైగా ఎగబాకడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ బంగారం ధర ఔన్సుకు 5,320 డాలర్లకు పైగా కొనసాగుతోంది. ఇటీవల ఇది 5,200 డాలర్ల వద్ద ఉండగా, గత వారాల్లో 4,700 డాలర్ల స్థాయి నుంచి క్రమంగా పెరిగింది. వెండి ధర ఔన్సుకు 92.70 డాలర్లకు పైగా ట్రేడవుతోంది. రూపాయి మారకం విలువ డాలర్‌కు ₹91 వద్ద ఉండటంతో దేశీయ మార్కెట్లో ధరల పెరుగుదల మరింత వేగం అందుకుంది.

అంతర్జాతీయ ధోరణి ప్రభావంతో హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి.

24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ₹1,73,090 వద్ద కొనసాగుతోంది.

22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ₹1,58,660 వద్ద ఉంది.

వెండి ధర కిలోకు ₹3,25,000కు చేరింది. రెండు రోజుల్లో సుమారు ₹30,000 పెరుగుదల నమోదైంది.

భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నంతకాలం బంగారం వంటి సురక్షిత పెట్టుబడులపై డిమాండ్ పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ధరలు ఇప్పటికే అత్యధిక స్థాయిలో ఉండటంతో కొనుగోలుదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.



# బ్లాక్ సంస్థలో భారీగా ఉద్యోగాల కోత

ప్రపంచ టెక్ రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ వ్యాపారవేత్త జాక్ డోర్సేయ్నే తృత్వంలోని ఆర్థిక సేవల సంస్థ లో భారీగా ఉద్యోగాల కోత ప్రకటించారు. దాదాపు 4,000 మంది సిబ్బందిని తొలగించనున్నట్లు సంస్థ వెల్లడించింది. సంస్థ ప్రస్తుతం లాభాల్లోనే ఉన్నప్పటికీ, పనితీరు సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాక్ డోర్సీ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు వినియోగంతో తక్కువ మంది సిబ్బందితోనే అధిక పనితీరును సాధించవచ్చని ఆయన విశ్వసిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో అంతర్గత వ్యవస్థలను మరింత ఆటోమేషన్ వైపు మళ్లించి ఖర్చులను తగ్గించడం, ఉత్పాదకతను పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా భావిస్తున్నారు. ఇక కృత్రిమ మేధస్సు ప్రభావంపై ప్రముఖ రచయిత రాబర్ట్ కియోసాకి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సాంకేతికత వల్ల ధనికులు మరింత లాభపడే అవకాశం ఉందని, సాధారణ ఉద్యోగులు మాత్రం ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంస్థలు ఖర్చులను తగ్గించుకుని లాభాలు పెంచుకుంటాయని, కానీ కార్మిక వర్గం గడ్డుకాలాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా చిత్రిని రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2028 నాటికి కృత్రిమ మేధస్సు విస్తృత వినియోగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది. అనేక రంగాల్లో మానవ శ్రమ అవసరం తగ్గిపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సాంకేతిక విప్లవం వేగంగా ముందుకు సాగుతున్న ఈ సమయంలో, భవిష్యత్తులో ఉపాధి రంగం ఎలా మారుతుందన్నది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ భద్రత, సామాజిక సమతుల్యత, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలు రానున్న సంవత్సరాల్లో కీలకంగా మారనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# హార్డ్ వర్క్ ఫలితం.. సంజుపై సూర్య ప్రశంసలు

టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ పోరులో విజయం సాధించిన భారత్ సెమీస్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ సంజు శాంసన్ అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. 97 పరుగులతో చివరి వరకు నిలబడి జట్టుకు ధైర్యం నింపాడు. మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సంజు ప్రదర్శనపై ప్రశంసల వర్షం కురిపించాడు. చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో ఆటగాళ్లంతా సమిష్టిగా ఆడిన తీరు తనకు ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నాడు. ముఖ్యంగా సంజు ఓపికగా అవకాశాల కోసం ఎదురుచూసి, వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందుకున్నాడని అన్నాడు. అతడి కష్టపాటు, పట్టుదలే ఈ ఇన్నింగ్స్‌కు కారణమని స్పష్టం చేశాడు. ఒత్తిడి పరిస్థితుల్లో కూడా సంజు ధైర్యంగా బ్యాటింగ్ చేయడం జట్టుకు పెద్ద బలమైందని సూర్యకుమార్ తెలిపాడు. భాగస్వామ్యాలే ఈ మ్యాచ్‌లో కీలకమయ్యాయని, బ్యాటర్లు ప్రణాళిక ప్రకారం ఆడగా బౌలర్లు కూడా కచ్చితమైన ప్రణాళికతో బంతులు సంధించారని వివరించాడు. క్రికెట్‌లో ఒత్తిడి సహజమే అయినప్పటికీ, అలాంటి సమయాల్లోనే ఆటగాళ్ల అసలు ప్రతిభ వెలుగులోకి వస్తుందని అభిప్రాయపడ్డాడు. దీంతో సంజు శాంసన్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న అతడు కీలక సమయంలో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. రానున్న సెమీస్ పోరులో కూడా ఇలాంటి ప్రదర్శన కొనసాగితే భారత్‌కు కప్ కల సాకారం కావచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# అదే 97 పరుగులు.. గంభీర్ ఇన్నింగ్స్‌ను గుర్తు చేసిన సంజు

టీ20 ప్రపంచకప్ 2026 తుది దశకు చేరుకుంటున్న వేళ దేశవ్యాప్తంగా సంజు పేరు మార్మోగుతోంది. విండీస్‌పై అతడు ఆడిన అద్భుత ఇన్నింగ్స్ అభిమానులను ఉర్రూతలూగించింది. 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో చేసిన 97 పరుగులు జట్టును విజయపథంలో నడిపించాయి. ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న సంజు శాంసన్ కీలక సమయంలో తన ప్రతిభను నిరూపించుకుని జట్టుకు ఎంత అవసరమో చాటి చెప్పాడు. దాదాపు పదకొండేళ్ల కెరీర్‌లో అవకాశాలు వచ్చినా రాకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోని సంజు, చావో రేవో మ్యాచ్‌లో తానేంటో చూపించాడు.



అతడు చేసిన 97 పరుగులు ఇప్పుడు అభిమానులకు మరో చారిత్రాత్మక ఇన్నింగ్స్‌ను గుర్తు చేస్తున్నాయి. అది 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో గౌతమ్ గంభీర్ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్. శ్రీలంకపై జరిగిన ఆ తుది పోరులో గంభీర్ క్రీజులో నిలబడి జట్టును గెలుపు దిశగా నడిపించాడు. సెంచరీకి మూడు పరుగుల దూరంలో అవుట్ అయినప్పటికీ అతడి పోరాటం లేకపోతే భారత్ విజయం సాధించేదా అన్న ప్రశ్న ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది.

ఆ మ్యాచ్‌లో చివరికి ఎంఎస్ ధోనీ కొట్టిన ఆ సిక్స్ భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయం అయింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత భారత్‌కు రెండో వన్డే ప్రపంచకప్ అందించిన ఆ షాట్ ఎప్పటికీ అభిమానుల హృదయాల్లో నిలిచిపోతుంది. అయితే గంభీర్ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌కు తగిన గుర్తింపు రాలేదనే అభిప్రాయం చాలామందిలో ఉంది. పెరీరా బౌలింగ్‌లో అవుట్ అయిన గంభీర్ సెంచరీ కోల్పోయినా, జట్టును నిలబెట్టిన స్థిరమైన ఆటతీరుతో విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఇప్పుడు సంజు కూడా అదే సంఖ్యను తాకడం విశేషంగా మారింది. సెంచరీ కాకపోయినా ఆ 97 పరుగులే మ్యాచ్‌ను మలుపుతిప్పాయి. తుది దశకు చేరుకున్న ఈ టోర్నీలో సంజు ఇన్నింగ్స్ జట్టుకు అపారమైన ఆత్మవిశ్వాసం ఇచ్చింది. అభిమానులు ఇద్దరి ఇన్నింగ్స్‌లను పోలుస్తూ సామాజిక మాధ్యమాల్లో చర్చలు జరుపుతున్నారు.

సెంచరీలు మాత్రమే కాదు, కీలక సమయంలో చేసిన పరుగులే అసలు విలువైనవని ఈ రెండు ఇన్నింగ్స్‌లు మరోసారి చాటిచెప్పాయి. 2011లో గంభీర్ 97 లేకపోతే ప్రపంచకప్ కల సాకారం అయ్యేదా? నేడు సంజు 97 లేకపోతే జట్టు మరో దశకు చేరుకునేదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు అభిమానుల మనసుల్లో మార్మోగుతున్నాయి. క్రికెట్‌లో సంఖ్యలు కేవలం గణాంకాలే అయినప్పటికీ, కొన్ని సంఖ్యలు మాత్రం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటాయని ఈ 97 పరుగులు మళ్లీ నిరూపించాయి.

# చెత్త ప్రదర్శనకు పాక్ ఆటగాళ్లపై భారీ జరిమానా

టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ క్రికెట్ బోర్డు కఠిన నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లపై భారీ జరిమానా విధించినట్లు ప్రకటించింది. సూపర్ 8 దశలోనే జట్టు నిష్క్రమించడంతో అభిమానుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో బాధ్యులైన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది.

బోర్డు నిర్ణయం ప్రకారం కీలక ఆటగాళ్లపై ఒక్కొక్కరికి సుమారు 50 లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా విధించారు. ఇది భారత కరెన్సీలో సుమారు 17 లక్షల రూపాయలకు సమానం. జట్టులో ప్రధాన బాధ్యతలు నిర్వర్తించాల్సిన సీనియర్ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంపై బోర్డు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, వేగ బౌలర్ షహీన్ అఫ్రిది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ వంటి ప్రముఖులపైనా ఈ జరిమానా వర్తింపజేసినట్లు




సమాచారం. కీలక మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు రెండింట్లోనూ జట్టు విఫలమవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది.

భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సరైన ప్రదర్శన చేయకపోవడం, ఒత్తిడిని తట్టుకోలేకపోవడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో మెరుగైన ఆటతీరును కనబరచిన వారికి మాత్రమే ప్రోత్సాహకాలు ఉంటాయని బోర్డు స్పష్టం చేసింది. క్రమశిక్షణ లోపిస్తే మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఈ నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాబోయే సిరీస్‌ల్లో జట్టు ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అభిమానుల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం జట్టుకు పెద్ద సవాలుగా మారింది.

## పెళ్లి తర్వాత మరింత గ్లామర్‌తో రకుల్ సందడి

పెళ్లి తర్వాత కథానాయికల గ్లామర్ తగ్గుతుందన్న అభిప్రాయాన్ని సవాల్ చేస్తూ ముందుకు సాగుతోంది రకుల్ ప్రీత్ సింగ్. తాజా ఫోటో చిత్రాలతో సామాజిక మాధ్యమాల్లో హీట్ పెంచుతున్న ఈ నటి, తాను ఇంకా వాణిజ్య చిత్రాల పోటీలోనే ఉన్నానని స్పష్టంగా తెలియజేస్తోంది. ఇటీవల ఓ అవార్డు వేడుకలో పాల్గొన్న ఆమె ధరించిన వేషధారణ, ఆకర్షణీయమైన తీరు నెటిజన్ల దృష్టిని తనవైపు తిప్పుకుంది. కుమారిగా ఉన్న రోజుల కంటే శ్రీమతిగా మారిన తర్వాత మరింత ధైర్యంగా, మరింత గ్లామరస్‌గా కనిపిస్తోందనే చర్చ సాగుతోంది. సాధారణంగా వివాహం అనంతరం కథానాయికలు కొంత మితంగా ప్రవర్తిస్తారన్న భావన పరిశ్రమలో ఉంది. అయితే రకుల్ ఆ సాంప్రదాయాన్ని పూర్తిగా చెరిపేసింది. తన దేహదారుఢ్యాన్ని కాపాడుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉన్న ఆమె, ప్రతి ఫోటో చిత్రంలో తన ఆకృతి అందాన్ని హైలైట్ చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ప్రతి చిత్రం క్షణాల్లో వైరల్ అవుతోంది. అభిమానులు ఆమె అందాన్ని మెచ్చుకుంటూ ప్రశంసలు కురిపిస్తుండగా, సినీ వర్గాల్లో మాత్రం ఈ గ్లామర్ వ్యూహంపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న రకుల్‌కు ఇటీవల



కాలంలో అవకాశాలు కొంత తగ్గినట్లు తెలుస్తోంది. కొత్త కథానాయికల ప్రవేశం, పెరిగిన పోటీ, మారుతున్న ప్రేక్షక అభిరుచులు కలిసి పరిస్థితిని ప్రభావితం చేశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి సమయంలోనే తాను ఇంకా ప్రధాన కథానాయికగా నిలబడగలనని నిరూపించుకునేందుకు గ్లామర్‌ను ఆయుధంగా మలుచుకుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. సామాజిక మాధ్యమాలు ఈ రోజుల్లో కథానాయికలకు కీలక వేదికగా మారాయి. అందులో చురుకుగా ఉండి, ట్రెండింగ్‌లో నిలిస్తేనే దర్శక నిర్మాతల దృష్టిలో పడతారని భావన ఉంది. అదే దిశగా రకుల్ తన ఫోటో చిత్రాల ద్వారా స్పష్టమైన సంకేతం ఇస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. "నేను ఇంకా సిద్ధంగా ఉన్నాను, వాణిజ్య పాత్రలకైనా, గ్లామర్ పాత్రలకైనా వెనుకాడను" అన్న సందేశాన్ని ఆమె ఇస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే సినిమా రంగంలో కేవలం గ్లామర్ మాత్రమే సరిపోదు. బలమైన కథ, గుర్తుండిపోయే పాత్ర, ఒక ఘన విజయంఇవి కలిసి వస్తేనే కెరీర్ మళ్లీ ఊపందుకుంటుంది. రకుల్ ప్రీత్ సింగ్ కూడా అలాంటి అవకాశాన్ని ఎదురుచూస్తోందని తెలుస్తోంది. తెలుగులోనే కాదు, హిందీ చిత్రరంగంలో కూడా మరో బలమైన ప్రాజెక్ట్ కోసం వేచి చూస్తోంది. ప్రస్తుతం అయితే ఆమె ఫోటో చిత్రాల ద్వారానే వార్తల్లో నిలుస్తోంది. అభిమానుల ప్రశంసలు అందుకుంటూనే, తాను ఇప్పటికీ పూర్తి స్థాయి వాణిజ్య కథానాయికనే అని నిరూపించుకుంటోంది. మరి ఈ గ్లామర్ వ్యూహం ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అన్నది కాలమే తేల్చాలి.


## 50 రోజులు పూర్తి చేసిన 'మన శంకర వర ప్రసాద్ గారు'

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో రూపొందిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం విజయవంతంగా యాభై రోజులు పూర్తి చేసుకుంది. సరైన కథ, సరైన వినోదాత్మక సమర్పణ ఉంటే ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో ఈ చిత్రం మరోసారి నిరూపించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 12న విడుదలైన ఈ కుటుంబ కథా చిత్రం ఇప్పటికీ పలు ప్రదర్శన కేంద్రాల్లో విజయవంతంగా నడుస్తోంది. చిత్రబృందం వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల స్థూల వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఉత్తర అమెరికా ప్రాంతంలోనే దాదాపు మూడున్నర మిలియన్ డాలర్లకు సమానమైన ఆదాయం వచ్చినట్లు తెలిపారు. టికెట్ విక్రయ వేదికలో 38 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు ప్రకటించారు. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్లు అమ్ముడవడం అరుదైన విషయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ చిత్రాన్ని దర్శకుడు అనీల్ రావిపూడి తెరకెక్కించగా, ఆయన కెరీర్‌లోనూ, చిరంజీవి నట జీవితంలోనూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచిందని చెబుతున్నారు. దాదాపు 109




కేంద్రాల్లో యాభై రోజులు పూర్తి చేసుకోవడం ఈ సినిమాకు ప్రత్యేక గుర్తింపుగా మారింది. నాటక ప్రదర్శనలతో పాటు డిజిటల్ వేదికలో కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం జీ ఐదు వేదికలో ప్రసారం అవుతూ మంచి వీక్షణలు నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజుల్లో అగ్ర స్థానాల్లో నిలిచిన ఈ చిత్రం ఇప్పటికీ ప్రముఖ స్థానాల్లో కొనసాగుతోంది. వాణిజ్య వర్గాల అంచనాల ప్రకారం యాభై రోజుల్లో ఈ చిత్రం సుమారు 306 కోట్ల రూపాయల వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇందులో దేశీయంగా 219 కోట్ల నికర వసూళ్లు, 260 కోట్ల స్థూల వసూళ్లు నమోదయ్యాయని చెబుతున్నారు. విదేశాల్లో సుమారు 43 కోట్ల రూపాయల ఆదాయం వచ్చినట్లు అంచనా. దాదాపు 120 కోట్ల రూపాయల నాటక హక్కుల వ్యాపారం జరిగిన ఈ చిత్రం నిర్మాతలకు 60 నుంచి 70 కోట్ల రూపాయల లాభాలు అందించినట్లు సమాచారం. సరదా కథ, హాస్యం, భావోద్వేగం సమతుల్యంగా మేళవించిన ఈ కుటుంబ కథా చిత్రం మహిళలు, చిన్నారులు, అభిమానులను సమానంగా ఆకట్టుకుంది. 'మన శంకర వర ప్రసాద్ గారు' చిరంజీవి బాక్సాఫీస్ స్థైర్యాన్ని మరోసారి చాటిచెప్పిన విజయవంతమైన చిత్రంగా నిలిచింది.

## నేహా శెట్టికి అవకాశాల కోసం ఎదురుచూపులు



అందం, అభినయం, ఉత్సాహంఈ మూడు లక్షణాలు కలిసివస్తేనే ఓ నటి పరిశ్రమలో నిలదొక్కుకోగలదు. ఆ లక్షణాలన్నీ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు దొరకకపోతే కెరీర్‌లో ఒడిదుడుకులు తప్పవు. ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది అందాల నటి నేహా శెట్టి. ఒకే ఒక్క చిత్రంతో విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు మళ్లీ బలమైన పాత్ర కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ పూరి హీరోగా తెరకెక్కిన మెహబూబా చిత్రంతో నేహా శెట్టి తెలుగు తెరకు పరిచయమైంది. తొలి చిత్రమే కావడంతో ఆమెపై పెద్దగా అంచనాలు లేకపోయినా, తెరపై ఆమె అందం, తెగువ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో నేహా శెట్టికి మొదటి అడుగు పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. అయినప్పటికీ పరిశ్రమలో ఆమెకు అవకాశాలు తగ్గలేదు. ఆమె కెరీర్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పిన చిత్రం డీజే టిల్లు. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన నటించిన నేహా 'రాధిక' పాత్రతో యువతలో సంచలనమే సృష్టించింది. ఆ పాత్రలో ఆమె చూపించిన శైలీ, సంభాషణల తీరు, ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యువతలో ఆమెకు ప్రత్యేకమైన అభిమాన వర్గం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో 'రాధిక' పాత్రకు సంబంధించిన సంభాషణలు, దృశ్యాలు విస్తృతంగా చర్చకు దారి తీశాయి. ఒక్కసారిగా నేహా శెట్టి పేరు టాలీవుడ్‌లో ప్రముఖంగా వినిపించింది.


అయితే ఆ విజయానంతరం వచ్చిన చిత్రాలు మాత్రం ఆమెకు అంతటి గుర్తింపు తీసుకురాలేకపోయాయి. కొన్ని చిత్రాల్లో నటించినప్పటికీ అవి బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపకపోవడంతో ఆమె కెరీర్ మళ్లీ నెమ్మదించింది. విజయాలు వరుసగా రాకపోతే పరిశ్రమలో అవకాశాలు తగ్గడం సహజమే. అదే పరిస్థితి ఇప్పుడు నేహా శెట్టిని ఎదుర్కొంటోంది అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇటీవల పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఓజీ చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఆమెకు దక్కింది. ఈ గీతం ద్వారా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావాలనే ఆశలు ఆమె అభిమానుల్లో కనిపించాయి. అయితే చిత్రం నిడివి ఎక్కువగా ఉండటంతో ఆ భాగాన్ని తొలగించినట్లు వార్తలు వచ్చాయి. అనంతరం ఆ గీతాన్ని వేరుగా విడుదల చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమెకు మరోసారి నిరాశే మిగిలిందనే భావనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నేహా శెట్టి మంచి కథలు, బలమైన పాత్రల కోసం వేచి చూస్తోంది. పరిశ్రమలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో కీలకం. మరోవైపు ఆమె సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన తాజా చిత్రాలను అభిమానులతో పంచుకుంటోంది. గ్లామర్ ఫోటోషూట్లతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ మళ్లీ అవకాశాలు దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది.

సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నేహా శెట్టికి సరైన కథా ఎంపిక అత్యంత కీలకం. 'రాధిక' తరహాలో మరో బలమైన పాత్ర లభిస్తే ఆమె మళ్లీ విజయపథంలోకి రావడం ఖాయం అంటున్నారు. అందం మాత్రమే కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఎంచుకుంటే ఆమె కెరీర్ మరింత బలపడే అవకాశం ఉంది. అభిమానులు కూడా ఆమె నుంచి మరో గుర్తుండిపోయే పాత్రను ఆశిస్తున్నారు.

మొత్తంగా చూస్తే, ఒకే ఒక్క విజయంతో వచ్చిన క్రేజ్‌ను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో నేహా శెట్టి ఉదాహరణగా నిలుస్తోంది. అయితే పట్టుదలతో ముందుకు సాగితే అవకాశాలు మళ్లీ తలుపుతడతాయనే నమ్మకం ఆమె అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

## 'విశ్వనాథ్ అండ్ సన్స్'గా సూర్య 46వ చిత్రం

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, యువ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే శీర్షికను ఖరారు చేశారు. సూర్య నట జీవితంలో 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తొలి దర్శనాన్ని చిత్ర బృందం అధికారికంగా విడుదల చేయడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. విడుదలైన పోస్టర్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి ఓ చిన్నారిని ఎత్తుకుని కనిపించగా, సరళమైన కానీ హృదయానికి హత్తుకునే భావోద్వేగ స్పర్శ స్పష్టంగా కనిపిస్తోంది. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో సూర్య కనిపిస్తున్న తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో ఈ పోస్టర్ వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా మమితా బైజు నటిస్తోంది. ప్రముఖ నటి రాధికా శరత్ కుమార్, బాలీవుడ్ నటి రవీనా టాండన్, భవాని శ్రీ, బిజోర్న్ సర్‌రావు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కుటుంబ నేపథ్యంతో పాటు భావోద్వేగాలు, వాణిజ్య అంశాలను సమతుల్యంగా మేళవించిన కథగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సంగీతాన్ని జీవీ ప్రకాశ్ కుమార్ అందిస్తుండగా, గీతాలు మరియు నేపథ్య సంగీతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉండనున్నాయని తెలుస్తోంది. జూలై నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం పనులు వేగవంతం చేసింది. సూర్య వెంకీ అట్లూరి కలయిక కావడంతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి దర్శనంతోనే ఆసక్తిని రేకెత్తించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రాబోయే రోజుల్లో మరిన్ని విశేషాలతో అభిమానులను అలరించనుంది.




## 'టాక్సిక్' నుంచి తొలి గీతం విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జాతీయ పురస్కార విజేత దర్శకురాలు గీతూ మోహన్ దాస్ రూపొందిస్తున్న ఈ చిత్రం యష్ నట జీవితంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందనే విశ్వాసం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల విడుదలైన తొలి చూపు చిత్రంపై ఆసక్తిని అమాంతం పెంచగా, తాజాగా ఈ చిత్రంలోని తొలి గీతం 'తబాహి'ను చిత్రబృందం శ్రవణ రూపంలో విడుదల చేసింది. దృశ్య రూపంలో గీతం విడుదల కాలేదన్న నిరాశ అభిమానుల్లో కొంత ఉన్నప్పటికీ, స్వరరచన మాత్రం విశేష స్పందన అందుకుంటోంది. ఈ గీతాన్ని దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేశారు. తెలుగులో ప్రముఖ గేయరచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా స్వరపరచి స్వయంగా ఆలపించారు. యాక్షన్ తత్వం, భావోద్వేగ స్వరపాళ్లు మేళవించిన ఈ గీతం చిత్ర స్వరయాత్రకు బలమైన ఆరంభమని సంగీతాభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో యష్‌కు జోడీగా కియారా అద్వానీ నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్ తదితరులు నటిస్తున్నారు. ఈ విశాల తారాగణం చిత్రంపై అంచనాలను మరింతగా పెంచుతోంది. కేవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ వ్యయ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. యష్ నటించిన 'కేజీఎఫ్' శ్రేణి తర్వాత వస్తున్న చిత్రం కావడంతో దేశవ్యాప్తంగా వాణిజ్య వర్గాలు కూడా ప్రత్యేక దృష్టి సారించాయి. యాక్షన్, భావోద్వేగం, శైలీ సమర్పణ మేళవించిన ఈ చిత్రం భారతీయ చిత్రసీమలో మరో సంచలనం సృష్టిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి 'తబాహి' గీతంతో 'టాక్సిక్' స్వరప్రయాణం ప్రారంభమైందని చెప్పాలి.





Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com